
సాక్షి
పల్నాడు
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

సత్తెనపల్లి: స్థానిక దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం కోటి కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 516.70 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఘనంగా కల్యాణ మహోత్సవం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరులో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి(ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యాలయ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురంలోని మార్నింగ్‌స్టార్ కళాశాల, కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని హిందూ కళాశాల, ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గుండ్లపల్లిలోని జీసీ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్, ఎన్టీఆర్ జిల్లా నున్నలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల, మాచర్ల కేసీపీ న్యూ కాలనీలోని కిడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగే కార్యక్రమాల్లో ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



ఏఎన్‌యూ :ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ఆచార్య పి రాజశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు విజయవంతం కావాలని, ఫలప్రదమైన చర్చలు జరగాలన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం రామిరెడ్డి మాట్లాడుతూ 'మెటీరియల్ సైన్స్ అండ్ కేరెక్టరైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై మార్చి 6, 7 తేదీలలో నిర్వహిస్తున్నామన్నారు, సదస్సులో దేశ వ్యాప్తంగా పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, పరిశోధనా సంస్థలకు చెందిన భౌతిక శాస్త్రవేత్తలు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సెమినార్ కో- డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, కోశాధికారి ఆచార్య జి నాగరాజు, సభ్యులు ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, అధ్యాపకులు ఆచార్య వి రవికుమార్, ఆచార్య సీహెచ్ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

యార్డులో 1,39,924 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,10,512 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,39,924 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 21,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 85,622 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

14 మందికి హెడ్‌నర్సులుగా ప్రమోషన్



గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 14 మందికి శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి హెడ్‌నర్సులుగా ప్రమోషన్ ఇచ్చారు. ప్రమోషన్ కౌన్సెలింగ్‌కు 15 మందిని పిలువగా ఒకరు పదోన్నతి వద్దని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రమోషన్ సకాలంలో ఇచ్చినందుకు ఆర్డీకి ప్రమోషన్ పొందిన హెడ్‌నర్సులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య ప్రాప్తిరస్తు...



'ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి ఉప్పుతోల్ల నరసింహారావు. దుర్గి మండలం ముటుకూరు గ్రామం. బేల్దారి మేస్త్రీ. అనారోగ్యానికి గురయ్యాడు. నోటి క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. కుటుంబం చిన్నాభిన్నమైంది. వైద్యానికి డబ్బులు లేవు. స్థానిక ఏఎన్ఎం ఆరోగ్యశ్రీ పథకం కింద హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించింది. రూ.5 లక్షల పైగా ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద భృతి అందించింది.' సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనని, మా ఆయుష్షు కూడా పోసుకొని వందేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. మళ్లీ సీఎం వైఎస్ జగన్ కావాలని ఆకాంక్షించారు.

- ఆపన్నులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అండ
- పల్నాడులో 114 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు
- జిల్లాలో హెల్త్ కార్డులు 6,17,771

సాక్షి, నరసరావుపేట: మడమతిప్పని మహోద్యమకారుడు, విరమమెరుగని విప్లవవీరుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రాష్ట్రంలో పేదల అవసరాల దృష్టిలో పెట్టుకుని వైద్యం, విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మారుమూల పల్లెలో కూడా తక్షణమే వైద్యం అందించేలా చర్యలు చేపట్టారు. నిరుపేదలు ధైర్యంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేశారు. తరువాత నిర్లక్ష్యానికి గురైంది. అయితే ప్రజామద్దతుతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని పక్కాగా అమలుకు చర్యలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ పరిధి పెంచారు. ప్రస్తుతం రూ.25 లక్షల వరకు పథకం కింద వర్తించే విధంగా చర్యలు తీసుకున్నారు.



పిడుగురాళ్లలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శిస్తున్న ఆరోగ్యశ్రీ కో- ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్(ఫైల్)

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద లబ్ధి ఇలా..

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య	ఖర్చు రూ.కోట్లలో
2019-20	28,334	71.58
2020-21	37,551	95.10
2021-22	55,998	129.32
2022-23	72,585	167.73
2023-24 (31-12-23 వరకు)	34,938	67.34
మొత్తం	2,29,406	531.06

పల్నాడులో వైద్యం ఇలా...

పల్నాడు జిల్లా పరిధిలో 114 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు 3,257 రకాల చికిత్సలు అందించారు. పేదవాడికి రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం పొందారు. వైద్యం కోసం పేదలు అప్పుల పాలుకాకుండా ప్రభుత్వం ఆదుకుంటోంది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి జిల్లాలో 2,29,406 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.531.06 కోట్ల విలువ చేసే వైద్యం అందించారు.

ఆసరా ద్వారా రూ.54.58 కోట్లు...

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం స్ఫూర్తితో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రవేశపెట్టిన పథకమే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా. శస్త్ర చికిత్సల అనంతరం రోగి కోలుకునే వరకూ ఆసరాగా ప్రభుత్వం ఉండాలనే ఆలోచనతో ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. రోగి చికిత్స అనుసరించి అతడి విశ్రాంతి కాలంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.5,000 ఇస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా నగదు జమ చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 2019 నుంచి జిల్లా పరిధిలో 1,05,825 మందికి రూ.54.58 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేసింది.

ఆరోగ్య ఆసరా కింద నగదు సాయం..

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య	సాయం రూ.కోట్లలో
2019-20	5,999	3.89
2020-21	17,285	10.71
2021-22	28,871	14.99
2022-23	39,289	17.30
2023-24 (31-12-24 వరకు)	14,381	7.69
మొత్తం	1,05,825	54.58

2019 నుంచి

శస్త్రచికిత్సలు **2,29,406** మందికి
ఖర్చు రూ.**531** కోట్లు

ఆరోగ్య ఆసరా

లబ్ధి **1,05,825** మంది
ఖర్చు రూ.**54.58** కోట్లు లబ్ధి

ఆరోగ్యశ్రీ పేదలకు వరం...



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం. ఖరీదైన వ్యాధులకు ఉచితంగా చికిత్స అందుతోంది. గతంలో గుంటూరు, విజయవాడ లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం పల్నాడులో అన్ని రకాల మల్టీ స్పెషాల్టీ వైద్యసేవలు ఆరోగ్యశ్రీలో అందుబాటులో ఉన్నాయి. పేదలకు ఉచితంగా వైద్యం అందించడంతో పాటు విశ్రాంతి సమయంలో భృతిని అందజేస్తున్నాం. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రులపై నిఘా ఉంచి పేదలకు మెరుగైన వైద్యం పూర్తి ఉచితంగా అందేలా చూస్తున్నాం. ఏదైనా సమస్యలుంటే 104/9281073617 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

పైసా ఖర్చులేకుండా ఆపరేషన్




ఎడమ కాలి నరాల వాపు వచ్చి నడవడానికి ఇబ్బందిపడుతున్న నాకు గతేడాది గుంటూరులోని ప్రముఖ ఆస్పత్రిలో ఉచితంగా సర్జరీని ప్రభుత్వం చేయించింది. చికిత్స తరువాత పనిచేసుకోలేని సమయంలో కుటుంబం గడవడానికి ఆసరా పేరిట రూ.4,500 అందించారు. నా పరిస్థితి గమనించి వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. నెలనెలా ఒకటో తేదీ రూ.3 వేల వలంటీర్ తెల్లవారుజామునే ఇంటి గుమ్మం ముందు అందిస్తున్నారు. జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

–షేక్ అల్లానబీ, టీ దుకాణం, దమ్మాలపాడు, ముప్పాళ్ల మండలం

నేడు కొండగురునాథుని తిరునాళ్ల

గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రత్యేక బస్సులు



నూజెండ్ల: నూజెండ్ల మండలం రవ్వారం సమీపంలో వెలసిన కొండగురునాథుని స్వామి తిరునాళ్లకు సర్వం సిద్ధం చేశారు. శనివారం నుంచి రెండురోజులపాటు నిర్వహించే తిరునాళ్లకు గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు లక్షల సంఖ్యలో తరలి రానున్నారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున తిరునాళ్ల జరుపుకోవటం ఆనవాయితీ. కొండ గురునాథున్ని దర్శిస్తే కోర్కెలను తీరుస్తాడని భక్తుల విశ్వాసం, అలాగే కొండపైన వెలసిన సంతాన లింగేశ్వరున్ని ఆరాధిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. శనివారం కొండమెట్ల పూజతో ప్రారంభమయ్యే తిరునాళ్ల ఆదివారంతో ముగుస్తుందని ఆలయ కమిటీ తెలిపింది. తిరునాళ్లకు పదికి పైగా భారీ ఎలక్ట్రికల్ ప్రభలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం సత్రాల వారు అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యంతోపాటు నూజెండ్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. వినుకొండ ఆర్టీసీ డిపోతోపాటు ప్రకాశం జిల్లా అద్దంకి, దర్శి, పొదిలి డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఐనవోలు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5800, గరిష్ఠ ధర రూ.7500, మోడల్ ధర రూ.6400 వరకు పలికింది.

కబడ్డీ బాలుర విజేత గుంటూరు జట్టు



ప్రథమ స్థానం సాధించి మంత్రి అంబటి రాంబాబు నుంచి బహుమతి అందుకుంటున్న గుంటూరు బాలుర జట్టు



ద్వితీయ స్థానం సాధించి మంత్రి అంబటి రాంబాబు నుంచి బహుమతి అందుకుంటున్న ప్రకాశం బాలుర జట్టు

- బాలికల విజేతగా శ్రీకాకుళం జట్టు
- బహుమతులు అందజేసిన మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కబడ్డీ భారతీయ గ్రామీణ క్రీడ అని, 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ క్రీడా పోటీల నిర్వహణతో సత్తెనపల్లికి సరికొత్త కళ వచ్చిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాల, బాలికల కబడ్డీ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్, సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా పోటీలు నిర్వహించారు. పోటీలలో విజేతలకు మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా స్థాయి పోటీలకు సత్తెనపల్లి వేదిక కావడం ఆనందంగా ఉందని చెప్పారు. గ్రామాల్లో మట్టి నేలపై ఆడే స్థాయి నుంచి ప్రస్తుతం సాంకేతికత అంది పుచ్చుకొని రబ్బరు మ్యాట్లపై కబడ్డీ ఆడటం స్ఫూర్తి దాయకమన్నారు. ఫైనల్ మ్యాచ్‌ల్లో బాలురు, బాలికల జట్లు అద్భుత ఆట తీరును ప్రదర్శించాయని పేర్కొన్నారు. బాలికల విభాగంలో విజయనగరం, శ్రీకాకుళం జట్లు మొదటి స్థానం కోసం పోటీ పడగా శ్రీకాకుళం బాలికల జట్టు ఉత్తమ ప్రదర్శన ప్రదర్శించి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బాలుర విభాగంలో ప్రకాశం, గుంటూరు జిల్లా మధ్య జరిగిన పోటీ ఉత్కంఠ భరితంగా సాగిందని వివరించారు. ఉత్తమ ప్రదర్శనతో పాటు అదృష్టం తోడై గుంటూరు జిల్లా విజేతగా నిలిచిందన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ప్రకాశం, విజయనగరం జట్లు బాధపడాల్సిన పనిలేదని మీరు శక్తి మేరకు పోరాడారని అభినందించారు. అంతర్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన 20 మంది బిహార్ రాష్ట్రంలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తున్నారని వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సత్తెనపల్లిలో ఈ స్థాయి పోటీలను నిర్వహించిన వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూష గంగారపు, ప్రగతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, సందీప్, పరిటాల నరేష్‌లను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ సీహెచ్ ఈశ్వర్‌రెడ్డి, గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మర్రి సుబ్బరెడ్డి, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆరిక శ్రీరామిరెడ్డి, నందిపాటి నర్సిరెడ్డి, షేక్ రస్ హుస్సేన్, శేషయ్య, ఎస్.అచ్చిరెడ్డి, సుదర్శన్, వెళంగిణిరెడ్డి, గంపా శ్రీను, శాస్త్రి, ఏ చిన్నయ్య, పానెం శ్రీనివాసరెడ్డి, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూపు-2 పరీక్షలు

- జిల్లాలో 27 పరీక్షలు కేంద్రాలు
- హాజరుకానున్న 9,778 మంది అభ్యర్థులు



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు ఆదివారం నిర్వహించనున్న దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో పరీక్ష నిర్వహణపై లైజన్ అధికార్లు, రూట్ ఆఫీసర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడతూ 9,778 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని, 27 కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నరసరావుపేటలో-25, సత్తెనపల్లి-2, చిలకలూరిపేటలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. విధులు నిర్వహిస్తున్న అధికారులు ఏపీపీఎస్‌ఈ సూచనలు, నిబంధనలు విధిగా పాటించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద రిసెప్షన్ ఏర్పాటు చేయాలనీ, తాగునీటి వసతి, పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్ష హాలులోకి అభ్యర్థులను ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు మాత్రమే అనుమతించనున్నట్లు వెల్లడించారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలు జాగ్రత్తగా భద్రపరచాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలలో గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు నిషేధమన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రీమతి కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి అజయ్‌కుమార్, ఆర్డీఓలు రామకాంత్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పన స్థాయికి ఎదగాలి

జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ కె.వి.రమణ



రిజిస్ట్రార్ రమణను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

నరసరావుపేట ఈస్ట్: ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగ సాధనతో మాత్రమే సరిపెట్టకుండా ఉద్యోగ కల్పన దిశగా ముందడుగు వేయాలని జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె.వి.రమణ తెలిపారు. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సాంకేతిక విద్య రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతోందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కేవలం ఉద్యోగ సాధనే లక్ష్యంగా కాకుండా తామే ఉద్యోగాలను ఇచ్చే దిశగా పురోగతి సాధించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతాయని అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూ-ఎన్ కళాశాలకు ఉజ్వల భవిష్యత్ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రమణను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.శివరామకృష్ణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.పి.రాజు సత్కరించారు.

కమనీయం.. తిరుపతమ్మ కల్యాణం

పెనుగంచిప్రోలు: శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.23 గంటలకు మఖా నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ప్రత్యేకంగా ఖమ్మంకు చెందిన కళాకారులు నిర్మించిన బంగారు ఛాయ కలిగిన మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల సాక్షిగా అమ్మవారు, స్వామి వార్ల కల్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను, విమలాభాను దంపతులు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పీటలపై కూర్చొన్నారు. శ్రీ తిరుపతమ్మ అమ్మవారి వంశీకుల తరుపున కొల్లా రఘురామయ్య, రంగమ్మ దంపతులు, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, నందిగామ ఏసీపీ డాక్టర్ రవికిరణ్ దంపతులు కల్యాణ పీటలపై కూర్చొనగా వేద పండితులు, గ్రామ పురోహితులు, ఆలయ ప్రధాన అర్చకులు పాపమాంబ వంశీకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. కల్యాణాన్ని చూసేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లతో పాటు, భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నెడ్‌కాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్, ఎంపీపీ మార్కపూడి గాంధీ, దేవదాయ శాఖ మాజీ కమిషనర్ పి.సుందర్‌కుమార్, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, సీఐ జానకీరామ్, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపకాంతులతో అమ్మవారి ఆలయం



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఉదయభాను దంపతులు

'అమృత్'లో స్టేషన్ల అభివృద్ధికి రూ.221.42 కోట్లు

26న వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 13 అమృత్ భారత్ స్టేషన్లు, పది ఆర్‌యూబీలకు ఈనెల 26వ తేదీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ స్టేషన్ల రెండో దశలో 13 స్టేషన్లకు గాను రూ.221.42 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిలో గుంటూరు స్టేషన్‌కు రూ.40.67 కోట్లు, మంగళగిరి స్టేషన్‌కు రూ.12.56 కోట్లు, నంద్యాల రూ.21.80 కోట్లు, గిద్దలూరు రూ.11.72 కోట్లు, కంభం రూ.11.72 కోట్లు, మార్కాపూర్ రూ.21.50 కోట్లు, నరసరావుపేట రూ.23.12 కోట్లు, వినుకొండ రూ.12.45 కోట్లు, సత్తెనపల్లి రూ.11.29 కోట్లు, నడికుడి రూ.11.29 కోట్లు, మాచర్ల రూ.9.51 కోట్లు, మిర్యాలగూడ రూ.16.78 కోట్లు, నల్గొండ రూ.17.01 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

ఆర్‌యూబీలకు నిధులు

అదే విధంగా గుంటూరు డివిజన్ పరిధిలోని పది ఆర్‌యూబీలకు రూ.36.28 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కురిచేడు గేటుకు రూ.2.15 కోట్లు, వినుకొండ టౌన్ గేటు రూ.5.01 కోట్లు, మునుమాకా గేటు రూ.2.49 కోట్లు, వేమూలూరిపాడు గేటు రూ.5.01 కోట్లు, కొప్పూరావూరు గేటు రూ.5.90 కోట్లు, కంతేరు గేటు రూ.5.90 కోట్లు, దాచేపల్లి గేటు రూ.2.49 కోట్లు, నార్కెట్‌పల్లి గేటు రూ.2.48 కోట్లు, భుధారమ్ గేటు రూ.2.38 కోట్లు, కేసరాజుపల్లి గేటు రూ.2.47 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఆర్‌యూబీలను జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం, ఆర్.శ్రీనివాస్, కె.సైమాన్, సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్ కుమార్, సీనియర్ డీపీఓ షేక్ షహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రీ సర్వే ప్రక్రియ వేగవంతం

అధికారులకు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశం



లంకెలకూరపాడు(ముప్పాళ్ల): మండలంలోని ఆయా గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ కె.ఆర్ ఆదేశించారు. మండలంలోని లంకెల కూరపాడులో జగనన్న భూరక్ష-శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా జరుగుతున్న రాళ్ల పాతడాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తయిందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేచవరప్పాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని, బొల్లవరం, లంకెలకూరపాడు గ్రామాల్లో రాళ్ల పాతడం ప్రక్రియ జరుగుతోందని డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్ చెప్పారు. నార్నెపాడులో సర్వే కొలతలు జరుగుతున్నాయని తెలిపారు. పూర్తయిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ సర్వేయర్ విజయ్‌కుమార్, ఆర్.ఐ పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


నరసరావుపేట: ఎన్నికల విధుల నుంచి హృద్రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయ సారథి కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశామని శుక్రవారం తెలిపారు. ఇబ్బందులున్న వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మినహాయింపు ఇస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. నరసరావుపేట పరిసర ప్రాంతాలకు 16శాతం హెచ్‌ఆర్ఏ ఇస్తూ గతంలో విడుదల చేసిన గజెట్‌లో మిస్ అయిన గోనెపూడి, పమిడిపాడు రెండు గ్రామాలను కూడా చేర్చాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. సప్లిమెంటరీ గజెట్‌లో ఆ విషయం చేర్చి 16శాతం హెచ్‌ఆర్ఏను ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింప చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.మోహనరావు, జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు జి.లక్ష్మి కథలపై చర్చావేదిక

తెనాలి: ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో స్థానిక సాహితీ సాంస్కృతిక సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నెలనెలా నిర్వహిస్తున్న చర్చావేదిక, ఈ పర్యాయం ప్రముఖ కథారచయిత్రి జి.లక్ష్మి కథలపై జరగనుంది. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఈనెల 24వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఏర్పాటయే చర్చావేదికకు కేవీ రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. 'మాతృక' సంపాదకులు రమాసుందరి, 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్ పాల్గొంటారు.

యువికా ... అంతరిక్ష విజ్ఞాన వేదిక

- 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాధాన్యం
- రిజిస్ట్రేషన్‌కు మార్చి 20 వరకు గడువు
- జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 15 నుంచి 26 వరకు శిక్షణ
- యువశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు చక్కని అవకాశం
- ఎంపికైన విద్యార్థులకు ఏడు చోట్ల శిక్షణ కేంద్రాలు



సత్తెనపల్లి: అంతరిక్ష విజ్ఞానం, స్పేస్ అప్లికేషన్స్‌పై ప్రాథమిక పరిజ్ఞానం కల్పించేందుకు యువికా-2024 (యంగ్ సైంటిస్ట్) కార్యక్రమాన్ని భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) రూపొందించింది. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు చక్కని అవకాశం కల్పించింది. యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) పేరిట అర్హత కలిగిన విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన వారికి మే 15 నుంచి 28వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తారు. భోజన, వసతి, రవాణా ఖర్చులను ఇస్రో భరిస్తుంది. ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ టీచర్‌కు కూడా ప్రయాణ ఖర్చులు చెల్లిస్తారు. శిక్షణ అనంతరం శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి విశేషాలను వివరిస్తారు.

యువికా తేదీలు	
రిజిస్ట్రేషన్ ప్రారంభం	: ఫిబ్రవరి 22
తుది గడువు	: మార్చి 20
మొదటి విడత జాబితా విడుదల	: మార్చి 28
రెండో విడత జాబితా విడుదల	: ఏప్రిల్ 14
ఎంపికైన విద్యార్థులు	
రిపోర్టింగ్ చేయాల్సిన తేదీ	: మే 12
యువికా ప్రోగ్రామ్	: మే 13,14

ఏడు శిక్షణ కేంద్రాల ఎంపిక

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడు కేంద్రాల్ని ఎంపిక చేశారు. తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయి స్పేస్ సెంటర్, బెంగుళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్, అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్, శ్రీహరికోటలోని సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రాల్లో ఈ శిక్షణ ఇస్తారు.

చక్కని అవకాశం



విద్యార్థులు ప్రతిభ కనబరచడానికి, వారు కలల్ని నెరవేర్చుకోవడానికి యువికా ఒక చక్కని అవకాశం. దీన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించాలి. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేలా సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. భావి శాస్త్రవేత్తగా ఎదిగేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఏ.ఏ. మధుకుమార్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్, పల్నాడు

దరఖాస్తు చేసుకోవాలి ఇలా...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్.జీఓవీ.ఇన్ లేదా యువికాలో చేసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టు

సత్తెనపల్లి: బిహార్‌లో త్వరలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్లను సత్తెనపల్లిలోని వృంద మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఎంపిక చేశారు. 33వ ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ అంతర్ జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతల నుంచి రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేశారు.

బాలికల జట్టు: పి.యమున (శ్రీకాకుళం), పి.హారతి (శ్రీకాకుళం), ఎం.పావని (విజయనగరం), ఎస్.లక్ష్మీదేవి (విజయనగరం), పి. దాక్షాయణి (విశాఖపట్నం), బి.దివ్య (విశాఖపట్నం), ఈ.దేవకీబాయి(గుంటూరు), పి.గౌతమి (అనంతపురం), ఎస్.హిందూ(వైఎస్ఆర్ కడప), కె.నిరీష (నెల్లూరు), వి.నేత్ర (చిత్తూరు), బి.శిరీష (కర్నూలు), కె.సిబోరా (ప్రకాశం), టి.దివ్య శ్రీసత్య (పశ్చిమ గోదావరి), బి.మాధవి (కృష్ణా), ఓ.వాత్సల్య (తూర్పుగోదావరి), కోమలి (విశాఖపట్నం), షేక్ అప్సనా బేగం (గుంటూరు), అనురాధ (విజయనగరం), బి.ఆకాంక్ష (శ్రీకాకుళం)లు ఎంపికయ్యారు.

బాలుర జట్టు: ఎ.అభిలాష్ రెడ్డి (ప్రకాశం), బి.భవానీశంకర్ రెడ్డి (ప్రకాశం), ఎ. అశోక్‌రెడ్డి (ప్రకాశం), బి.బ్రహ్మయ్య (వైఎస్ఆర్ కడప), బి.సంతోష్ (వైఎస్ఆర్ కడప), వి.అబూత్‌కుమార్ (గుంటూరు), హెచ్ఎస్ తరుణ్ (గుంటూరు), కె.ప్రశాంత్ (గుంటూరు), ఆర్‌హెచ్.రాహుల్ (చిత్తూరు), ఎల్.జయశక్తి (చిత్తూరు), జి.త్రిమూర్తులు (తూర్పుగోదావరి), వి.అక్షయ్‌కుమార్ (తూర్పుగోదావరి), బి.శ్రీను (విశాఖపట్నం), ఎం.సుమంత్ (కృష్ణా), ఏ.శ్రీకాంత్ (నెల్లూరు), బి.భాను ప్రకాష్ (విజయనగరం), షేక్ అబ్దుల్ రషీద్ (పశ్చిమగోదావరి), బి.కుమార్ వెంకటేష్ (పశ్చిమగోదావరి), ఎస్.లోకేష్ (విశాఖపట్నం), కె.దశరథుడు (వైఎస్ఆర్ కడప) ఎంపిక అయ్యారు. ఎంపికైన జట్లను మంత్రి అంబటి రాంబాబు, వృంద మహిళా జూనియర్ కళాశాల డైరెక్టర్ అనూషా గంగారపు అభినందించారు.

శనగలు క్వింటా రూ.5440కు కొనుగోలు

నరసరావుపేట: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో శనగలు మద్దతు ధర క్వింటాకు రూ.5440గా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నిర్ణయించినట్లు జేసీ ఏ.శ్యాం ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు కేంద్రాలకు వెళ్లి సీఎం యాప్‌లో ఈనెల 28వ తేదీ నుంచి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు సమీపంలోని ఆర్‌బీకేలను సంప్రదించాలని జేసీ తెలిపారు.

జేఎన్‌టీయూలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు

ఎన్నికల కమిషన్‌కు తెలియజేసిన కలెక్టర్ శివశంకర్



కలెక్టరేట్ నుంచి సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ఎన్నికల కౌంటింగ్ కోసం కాకాని గ్రామ సమీపంలోని జేఎన్టీయూ ప్రాంగణంలో రెండు వేరు వేరు కౌంటింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఎన్నికల కమిషనర్‌కు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంచార్జ్ డీఆర్ఓ అజయ్‌కుమార్‌తో కలిసి ఎన్నికల సంఘం సీఈవో ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. విజయవాడ ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి దరఖాస్తులు డిస్పోజబుల్, ఏఎంఎఫ్, పోలింగ్ సిబ్బంది, ఎలక్షన్ అండ్ ఈఆర్, సంబంధిత అధికారుల ఖాళీలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఫిర్యాదులు, ప్రతికూల వార్తలు తదితర అంశాలపై రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం 6,7,8 సమస్యలను పరిష్కరించి, ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతున్నామని తెలిపారు. వినుకొండ నుంచి ఎక్కువగా ఫారం -7లు వస్తున్నాయని, క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపుతామని చెప్పారు. సమావేశంలో గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, కలెక్టరేట్ కార్యాలయ ఏవో జి.రవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రకాష్ నగర్‌లోని టౌన్‌హాలులో శుక్రవారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లు, అడిషనల్ అధికారులకు ఒకరోజు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల్లో పక్షపాతానికి తావివ్వకుండా నిష్పక్షపాతంగా, సమర్థంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రత అవసరమనీ, ఉదారతతో ఉండవద్దని అధికారులకు సూచించారు. ఎటువంటి పరిస్థితులలోనూ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతించవద్దని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 127 కేంద్రాల్లో 29,244మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ హుస్సేన్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

నరసరావుపేట: విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ హైవే సూచనల మేరకు జిల్లా రోడ్డు భద్రత కమిటీ సభ్యులైన రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో సంస్థ కన్వీనర్ ఆర్.కె.దుర్గాపద్మజ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ బహుమతులను అందజేశారు. వ్యాసరచనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గౌస్ బాషా, హేమచంద్ర, పురందేశ్వరరావు, చిత్రలేఖనంలో కళ్యాణి, గీతిక, హిమదుర్గ గెల్చుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ ,రోడ్ సేఫ్టీ ఎన్జీవో సభ్యులు బంగారయ్య, శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయంలో చోరీ

- వెంకటాద్రినాయుడి మండపంలో చిన్న స్టీలు హుండీ ధ్వంసం
- చిల్లర వదిలేసి నోట్లు మాత్రమే చోరీ చేసిన వైనం
- సీసీ కెమెరాల్లో రికార్డయిన నిందితుడి కదలికలు
- వేలిముద్రలు సేకరించిన క్లూస్‌టీం
- నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు



సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడు



సీసీ కెమెరా పుటేజీలో తాళాలు పగులకొడుతున్న నిందితుడు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయంలో గురువారం దుండగుడు హుండీ తాళాలు పగులకొట్టి నగదు దోచుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల అందించిన సమాచారం మేరకు.. గురువారం రాత్రి రోజూ మాదిరి వాచ్ మేన్‌లతో కలిసి అర్చకులు తాళాలు వేశారు. రాత్రి 12:45 గంటల తర్వాత ఉత్తరాన ఉన్న కృష్ణానది ఒడ్డు నుంచి దేవాలయం ప్రహరీ దూకి దుండగుడు మొదటి ప్రాకారం లోపలకు ప్రవేశించాడు. అక్కడ నుంచి ఉత్తర వైపున్న గేటు నుంచి రెండో ప్రాకారంలోకి, అక్కడి నుంచి ఉత్తరం వైపున ఉన్న మెట్ల మార్గం ద్వారా మూడో ప్రాకారంలోకి ప్రవేశించాడు. అక్కడ నుంచి ప్రణవేశ్వరుని ఆలయం మీదుగా వెంకటాద్రినాయుడు మండపంలోకి ప్రవేశించాడు. అక్కడున్న ఇనుప గ్రిల్ తలుపులకు వేసిన తాళాల్ని తనతో తెచ్చుకున్న గునపంతో పగులకొట్టి లోనికి ప్రవేశించాడు. మండపంలో శ్రీబాలచాముండేశ్వరి అమ్మవారి ఎదురుగా ఉన్న పెద్ద హుండీ పక్కనున్న చిన్న స్టీలు హుండీ తాళాల్ని పగుల కొట్టాడు. అక్కడే అమ్మవారి పాత చీరలో చిల్లర వదిలేసి నోట్లను మాత్రమే మూట కట్టుకుని వచ్చిన దారినే దేవాలయం బయటకు వచ్చాడు. వెళుతూ కృష్ణానది ఒడ్డున కూర్చొని నోట్లను మడత పెట్టుకుని కొన్ని చిల్లర నాణేలు, పాత చీరను అక్కడే వదిలి వెళ్లిపోయాడు. శుక్రవారం వేకువ జామున స్వామి పూజ కార్యక్రమాల మొదలు పెట్టటం కోసం అర్చకులు వచ్చి వెంకటాద్రి నాయుని మండపం తాళాలు పగులకొట్టి ఉండటం గమనించారు. అమరావతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బ్రహ్మం ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దేవాలయంలోని సీసీ కెమెరాలలో పుటేజీ ఆధారంగా చోరీలో పాల్గొన్న దుండగుడు ఒక్కడే అని నిర్ధారించారు. ఘటన స్థలిలో వదిలి వెళ్లిన గునపం, హుండీ పైన, ఇనుపగ్రిల్స్ తలుపులపైన వ్రేలిముద్రల్ని క్లూస్‌టీం సేకరించింది. ఈవో వేమూరి గోపీనాథశర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ దర్యాప్తు వేగవంతం చేయాలి

అమరావతి: ప్రసిద్ధ అమరావతి అమరేశ్వర స్వామి దేవాలలయంలో హుండీ పగులకొట్టి నగదు చోరీ కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు పోలీసుల్ని కోరారు. చోరీ ఘటనపై ఆయన శుక్రవారం మాట్లాడుతూ కోట్లాది మంది ఎంతో నమ్మకంతో పూజించే అమరేశ్వరాలయంలో జరిగిన చోరీపై పోలీసులు అన్నికోణాలలో త్వరితగతిన విచారణ చేసి దుండగుడిని పట్టుకోవాలని కోరారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను కాపాడటానికి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా దేవదాయ, పోలీసు శాఖ సంయుక్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాలయ భద్రత ఏర్పాట్లపై పునఃసమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దురదృష్ట సంఘటన

ఈ సంఘటనపై దేవాలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం కలిగిన దేవాలయంలో ఇటువంటి దురదృష్ట సంఘటన జరగడం బాధాకరమని తెలిపారు. దేవాలయంలో ఉన్న 32 సీసీ కెమేరాల్లో 31 పని చేస్తున్నాయని చెప్పారు. విషయాన్ని మూడు రోజుల కిందట సిబ్బంది తన దృష్టికి తెచ్చారని, మరమ్మతులు చేయడానికి మెకానిక్ రావడం ఆలస్యమైందని పేర్కొన్నారు. ఈ సంఘటన పూర్వాపరాలను ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. వాచ్‌మేన్‌ల వివరణ తీసుకుని దానితో పాటు పోలీసుల విచారణ నివేదికను దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు

చోరీ ఘటనపై స్థానిక సీఐ ఎ.వి. బ్రహ్మం మాట్లాడుతూ సీసీ కెమెరాలలో చోరీకివచ్చి నిందితుని కదలికలు స్పష్టంగా నమోదయ్యాయని తెలిపారు. వాటితో పాటు వేలిముద్రలు, చోరీ జరిగిన తీరును బట్టి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని పేర్కొన్నారు.

ఘనంగా విశ్వంజీ జన్మదిన వేడుకలు

హాజరైన హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రుపాడులో గల విశ్వనగర్‌లో విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 80వ జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్ రామచంద్రరావు హాజరయ్యారు. గురుపీఠంలో విశ్వంజీని కలిసి ఆశీస్సులు అందుకున్నారు. తదనంతరం నూతనంగా నిర్మించిన విశ్వశ్రీ కల్యాణ మందిరాన్ని విశ్వంజీతో కలిసి రామచంద్రరావు ప్రారంభించారు.

విష్ణు సహస్రనామ పారాయణం

విశ్వంజీ జన్మదిన వేడుకల్లో భాగంగా గుంటూరు బృందావన క్షేత్రం విష్ణు సహస్రనామ పారాయణ సంఘం బృందం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ప్రజలంతా వంశవృద్ధి, శతృభయ నివారణ కలిగి ఉండాలని కోరుతూ శ్రీలక్ష్మీనారాయణ కల్యాణం చేశారు. కల్యాణాన్ని విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీ శృంగేరీ శారదాపీఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ ప్రవచన నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమానికి చెందిన కె. ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లాంలో భూముల ఆక్రమణలపై విచారణ

- రికార్డుల్లో పొందుపరచకుండా నకిలీ బీఫాంతో నిర్మాణాలుగా నిర్ధారణ
- జగనన్న కాలనీల్లోని కమ్యూనిటీ, ఖాళీ స్థలాలను వదలని కబ్జాదారులు
- గత తహసీల్దార్, వీఆర్వో సంతకాలతో తంతు నడిచినట్లు ధ్రువీకరణ

తాడికొండ: లాంలో నకిలీ బీ ఫారం సర్టిఫికెట్లతో ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం జరుగుతున్న వ్యవహారంలో రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. వీఆర్వో శర్మ, గత తహసీల్దార్ కుటుంబరావు సంతకాలతో కూడిన బీఫారం సర్టిఫికెట్లతో లాం గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఖాళీ స్థలాల కబ్జా వ్యవహారం నడిపించారు. ఈ వ్యవహారం శృతిమించడంతో గ్రామానికి చెందిన వ్యక్తులు కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఆమె విచారించి అక్రమాలుంటే కూల్చేయాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో అక్రమాలను గుర్తించి రెవెన్యూ, పంచాయతీ అధికారులు నోటీసులిస్తున్నారు. శుక్రవారం రెవెన్యూ ఆర్ఐ వంశీ కృష్ణ, వీఆర్వో వేణుబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి విచారణలో భాగంగా లాం- జొన్నలగడ్డ రోడ్డులో హోం సైన్ కళాశాల వెనుక భాగంలో ఉన్న జగనన్న కాలనీలో పరిశీలించగా 21 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. ఇంకా పలు ప్రాంతాల్లో కూడా ఈ అక్రమ నిర్మాణాల తంతు వందల సంఖ్యలో జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లాం గ్రామంతో పాటుగా తాడికొండ, బడేపురంలోని జగనన్న కాలనీలు, పోరంబోకు స్థలాలకు కూడా సదరు సంతకాలతో కూడిన బీ ఫారంతో భారీగా ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఆర్ఐ, వీఆర్వో, కార్యదర్శి